క్లుప్తంగా

శివ సహస్రనామ పూజలు



శివ సహస్రనామార్చన పూజ చేస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సప్తసోమవారాల ప్రదక్షిణల్లో పాల్గొని ఏడు సోమవారాలు పూర్తిచేసుకున్న భక్తులు మంగళవారం శివ సహస్రనామ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, అర్చకులు మద్దూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మాక్ డ్రిల్



ప్రకృతి విపత్తుల్లో రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

యలమంచిలి: కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం దొడ్డిపట్ల హైస్కూల్ ప్రాంగణంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలు తమను తాము రక్షించుకొనే విధానాలపై పలు విన్యాసాల ద్వారా అవగాహన కల్పించింది. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్ కుమార్, నారినమెరక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ డేగల సత్యనారాయణ, స్థానిక నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, చేగొండి రవిశంకర్ పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్: కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ సమకూర్చిన కుట్టు మెషీన్లను మంగళవారం నరసాపురం మండలం పసలదీవి పంచాయతీ కార్యాలయంలో 38 మంది మహిళలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి అధికారి రవీంద్రగౌతమ్, సర్పంచ్ కొట్టు రామాంజనేయులు, ఎంపీటీసీ రాంబాబు, మాజీ ఎంపీపీ వాతాడి కనకరాజు, షేడ్ స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పీడీ సుధీర్‌కుమార్, లేసు పార్కు మాజీ అధ్యక్షురాలు రంగిశెట్టి బేబి తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో 80 గణపతి మండపాలకు అనుమతి

అత్తిలి: మండలంలో వినాయక చవితి సందర్భంగా 80 వినాయక మండపాలు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినట్లు అత్తిలి ఎస్సై పి.ప్రేమరాజు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి మండపాలను పరిశీలించి అనుమతులు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండపాలను నిర్వహించాలని కోరారు. అశ్లీల కార్యక్రమాలు నిర్వహించరాదని విపరీతమైన ధ్వనులు వచ్చే వాయిద్యాలను వాడరాదని ఆయన కోరారు. ఉత్సవాల నిర్వహణకు కమిటీల వారే బాధ్యత వహించాలని ఎస్సై కోరారు.

సాంకేతిక రంగంలో మనోళ్లే కీలకం

భీమవరం: ప్రపంచ దేశాల్లోని సాంకేతిక రంగంలో మన దేశానికి చెందినవారిదే ప్రధాన పాత్రగా ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. యువ సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలో జాతీయ స్థాయిలో చేపట్టిన 'అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ 2025' సెమీ ఫైనల్స్ సెప్టెంబర్ 10న భీమవరం ఎస్ఆర్ కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న నేపథ్యంలో మంగళవారం ఆమె పోస్టర్ విడుదల చేశారు. ప్రభుత్వం యువ సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలోనే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ మాట్లాడుతూ ఈనెల 28న కళాశాల స్థాయిలో హ్యాకథాన్ పోటీలు నిర్వహిస్తామని, ఎంపికైన రెండేసి బృందాలు సెప్టెంబర్ 10న ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి తమ కళాశాలలో ప్రభుత్వం సెమీ ఫైనల్స్ ఏర్పాటు చేసిందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రతి ఏటా వివిధ డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో హ్యాకథాన్ పోటీలు జాతీయ స్థాయిలో నిర్వహించి విద్యార్థులను తీర్చిదిద్దేందుకు వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ పి.రవి కిరణ్‌వర్మ, టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్ గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

వినాయక చవితి కోలాహలం



కొప్పర్రులో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: మండపానికి తరలుతున్న గణనాథుడు



పెనుగొండ: వడలిలో వినాయక వ్రత కల్ప పుస్తకాల పంపిణీ

- మార్కెట్‌లో జోరుగా పూజా సామగ్రి అమ్మకాలు
- అధిక ధరలతో బెంబేలు



పాలకొల్లు సెంట్రల్: మెయిన్ రోడ్డులో గోల్డ్ మార్కెట్ వద్ద విద్యుద్దీపాలంకరణ



పెనుగొండ: సిద్ధాంతంలో పండ్లు, గొడుగుల అమ్మకాలు

నరసాపురం: నరసాపురం మార్కెట్‌లో మంగళవారం వినాయక చవితి సందడి నెలకొంది. ఉదయం నుంచి విగ్రహాలు, పత్రి, పండ్లు, పూలు అమ్మకాలు మార్కెట్‌లో జోరుగా సాగాయి. ప్రకాశం రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున దుకాణాలు ఏర్పాటు చేసి పాలవెల్లులు, అలంకరణ సామగ్రి విక్రయించారు. పండ్లు, పూల ధరలు విపరీతంగా పెరగడంతో జనం బెంబేలెత్తారు. ఆపిల్ కాయ రూ.40, బత్తాయి కాయ రూ.25, ఎలక్కాయ రూ.20 వరకు విక్రయించారు. దీంతో సగం సగం సరుకులు మాత్రమే కొనాల్సి వచ్చిందని, పువ్వుల రేట్లతే మరీ ఎక్కువగా ఉన్నాయని కొనుగోలుదారులు వాపోయారు. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం పడటంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఇక పట్టణంలో పలు వార్డులు, ప్రధాన ప్రాంతాలు, ముఖ్య కూడళ్లలో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది కొత్తగా పలు ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాలకు స్థానిక యువకులు ఉపక్రమించారు. ఆయా ప్రాంతాల్లో పందిళ్లు వేశారు. పెద్దపెద్ద విగ్రహాలను తీసుకొచ్చారు. పట్టణమంతా వినాయక చవితి కోలాహలం నెలకొంది.

వినాయక ప్రతిమల పంపిణీ

నరసాపురం రూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కొప్పర్రు ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఉప్పుగంటి రాజశ్రీ అన్నారు. ఈ మేరకు మంగళవారం కొప్పర్రు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మట్టితో తయారు చేసిన వినాయకుని విగ్రహాలను విద్యార్థులు, గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ ముత్యాల దుర్గ, ఉపాధ్యాయులు, స్వామి, అన్నపూర్ణ, పోలిశెట్టి బులిసత్యం తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గణపతి నవరాత్రులు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: నేటి నుంచి గణపతి నవరాత్రులు సందర్భంగా మంగళవారం పట్టణ మహాత్మాగాంధీ (మెయిన్ రోడ్డు) రోడ్డులో సందడి వాతావరణం నెలకొంది. రోడ్డుకు ఇరువైపులా మారేడు, మామిడి, జమ్మి, రావి, మర్రి ఇలా 21 రకాల పత్రి, పండ్లు, పువ్వులు, గణపతి బొమ్మలు, కలువ పువ్వులు పాలవెల్లులు తదితర పూజ సామగ్రిని విక్రయించారు. మార్కెట్ సందడిగాఉన్నా వ్యాపారులు అనుకున్నంత స్థాయిలో వ్యాపారం లేకపోవడంతో డీలాపడ్డారు. పర్యావరణ పరిరక్షణ అంటూ అనేక సేవా సంస్థలు ఎక్కడికక్కడ మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం, ఉదయం నుంచి వర్షం తదితర కారణాలు వ్యాపారులను నిరాశపర్చాయి. ఉత్సవ కమిటీ సభ్యులు విద్యుద్దీపాలంకరణలు, చలువ పందిర్లతో మండపాలను సుందరంగా తీర్చిదిద్దారు. గణపతి విగ్రహాలను మండపాల వద్ద ఊరేగింపుగా తరలించారు. బుధవారం ఉదయాన్నే మరికొందరు తీసుకువెళ్లనున్నారు. పట్టణంలో సుమారు 50 ప్రాంతాల్లో గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. చాంబర్స్ కళాశాల ఆధ్వర్యంలో పీపీ రోడ్డులో టెంట్ వేసి మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. వివిధ పాఠశాలలో విద్యార్థులు గణపతి పూజలు చేశారు. మట్టి గణపతుల తయారీ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

గ్రామాల్లో చవితి సందడి

పెనుగొండ: గ్రామాల్లో చవితి సందడి నెలకొంది. చలువ పందిళ్లు వెలిశాయి. సోమవారమే చలువ పందిళ్ల వద్దకు చేరిన విగ్రహాల చుట్టూ చిన్నారులు ప్రదక్షిణలు చేశారు. ఇళ్లల్లో చవితి పూజలకు పత్రి, పండ్లు, పువ్వులకు తదితర పూజా సామగ్రి దుకాణాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేశారు. అయితే, మంగళవారం ఉదయం నుంచి ముసురు వచ్చి చినుకులు పడుతుండడంతో వ్యాపారులు ఢీలా పడ్డారు. సాయంత్రంనుంచి దుకాణాల వద్ద కొద్దిగా సందడి నెలకొంది. పెరిగిన ధరలతో అనుకున్న స్థాయిలో వ్యాపారం లేదంటున్నారు. దుకాణాల్లో పండ్లు, పువ్వులు బాగా మిగిలిపోయాయి.

మట్టి ప్రతిమలు, వ్రత కల్ప పుస్తకాలు

పెనుగొండ, వడలి, సిద్ధాంతం గ్రామాల్లో విద్యార్థులకు మట్టి ప్రతిమలపై విస్తృత ప్రచారం చేశారు. వడలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వినాయక వ్రత కల్ప పుస్తకాలు పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో గణపతి మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలంటూ పెనుగొండలో విద్యార్థులు అవగాహన కల్పించారు.



పెనుగొండ: పెనుగొండలో మట్టి విగ్రహాలతో విద్యార్థుల ప్రదర్శన



పెనుగొండ: విక్రయానికి సిద్ధంగా పువ్వులు



పాలకొల్లు సెంట్రల్: గణపతి పూజలో పాల్గొన్న చిన్నారులు

దీర్ఘకాలిక లక్ష్యాలతో చదవండి



ఆర్యన్ ఉదయ్‌ను సన్మానిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

నరసాపురం రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు దీర్ఘకాలిక లక్ష్యాలతో చదువును కొనసాగించడంతో పాటు ఆచరణాత్మక జ్ఞానంతో విద్యను అభ్యసిస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చునని లండన్‌లోని కింగ్ సింగ్టన్, సెల్సియా నగర డిప్యూటీ మేయర్ ఆరేటి ఆర్యన్ ఉదయ్ అన్నారు. మంగళవారం నరసాపురం మండలం సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులను ఉద్దేశించి ఆరేటి మాట్లాడారు. సరైన ప్రతిభ లేకుండా విదేశాలకు వచ్చి స్థిరపడదామనే ఆలోచనలు మానుకోవాలని, ప్రతిభ ఉంటే ఎక్కడైనా రాణించవచ్చని అన్నారు. తాను పడిన కష్టాలను గుర్తుచేశారు. బీటెక్ విద్యార్థులు అడిగిన సందేహాలను ఆరేటి నివృతి చేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆరేటిని ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీ సమస్యపై గళమెత్తిన ఎంపీటీసీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ : ఆచంటలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీలు గళమెత్తారు. మంగళవారం ఆచంట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆర్టీసీ బస్సు సర్వీసు, డ్రెయినేజీల సమస్యలను ప్రస్తావించారు. వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, ఎంపీటీసీ బాలం సుబ్రహ్మణ్యం డ్రెయినేజీ సమస్యలపై మాట్లాడుతూ ఆచంట, వల్లూరుల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దోమలు పెరిగి డెంగీ వంటి విష జ్వరాలు వ్యాప్తి చెందున్నాయన్నారు. వీటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కేంద్రం భీమవరం వెళ్లడానికి బస్సు సౌకర్యంలేక ఆచంట మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి మాట్లాడుతూ దోమల నిర్మూలనుక మందు పిచికారి చేయాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి తీసుకెళతామన్నారు. ఎంపీడీఓ బి.కృష్ణమోహన్, తహసీల్దారు కనకరాజు, ఏఓ బాబ్జి, నాగిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


లేబర్ కోడ్‌లు నిలుపుదల చేయాలి



తణుకులో సీఐటీయూ జెండాను ఆవిష్కరించిన ప్రతాప్ తదితరులు

తణుకు అర్బన్: కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు నిలుపుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద సీఐటీయూ 4వ మహాసభని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ మహా సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షురాలు ఏ. అజయకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ఉద్యోగ, కార్మికులకు చాలా ప్రమాదకరమైనవని అన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు నేటికీ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని, స్కీమ్ వర్కర్స్‌కి కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన 12 గంటల పనిని వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని హెచ్చరించారు. ముందుగా సీఐటీయూ జెండాను ప్రతాప్ ఆవిష్కరించగా, గడిచిన మూడు సంవత్సరాలుగా నిర్వహించిన కార్యక్రమాలు కార్యదర్శి గుబ్బల గోపి వివరించారు. యన్. ఆదినారాయణ బాబు, ఎం.మధు షీల అధ్యక్షులుగా వ్యవహరించిన ఈ మహాసభలో పీఎల్. నరసింహారావు, పి. దక్షిణా మూర్తి, గార రంగారావు, వల్లూరి వెంకటేశ్వరావు, ఐద్వా కార్యదర్శి కె. నాగరత్నం, ఎం. రమేష్, శివ కుమార్, రవి రామకృష్ణ, ఎస్.చిన్నారావు, ఎ.రామకృష్ణ, ఎం. గంగాధర్ రెడ్డి, రమేష్ జ్యోతి బాబు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం బస్తాల పంపిణీ



తణుకులో పేదలకు బియ్యం బస్తాలు అందిస్తున్న ఎన్‌సీసీ నాయకులు

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద నేషనల్ క్రైస్తవ కౌన్సిల్ (ఎన్‌సీసీ) పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం ఆమె జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కౌన్సిల్ నాయకులు పి.ఐజాక్ బ్రెన్హమ్, కె.బ్లెస్సింగ్ రాజు అధ్యక్షతన పేదవర్గాలకు బియ్యం బస్తా లు పంపిణీ చేశారు. కౌన్సిల్ నాయకులు కేఎస్.రాజు, కె.డేవిడ్‌బాబు, ఎస్.కృపావరం థెరి స్సా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఒ.మనోజ్ బాబు మాట్లాడుతూ మదర్‌థెరిస్సా నిరుపేదల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయురాలన్నారు. ఆమె చూపిన సేవా మార్గం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

29న ఏఎస్ఎన్ఎం కళాశాలలో జాబ్‌మేళా

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ నేషనల్ కెరియర్ సర్వీస్ ఆధ్వర్యంలో ఉద్యోగ దిక్సూచి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. ఈ నెల 29న శుక్రవారం మెగా జాబ్‌మేళా ఏర్పాటుచేశామని చెప్పారు. డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన నిరుద్యోగులు తమ బయోడెటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఉదయం 9 గంటలకు కళాశాలలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఎస్ఆర్ఐఏఎస్ఎన్ఎంజీడీసీపీఏఎల్ఏకేవోఎల్ డాట్ ఏసీ డాట్ ఐఎన్‌లో పొందుపరిచామని తెలిపారు. ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసి, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, బీటీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, కామెంట్ స్టాపింగ్ సొల్యూషన్స్, పంజాబ్ నేషనల్ బ్యాంకు నెట్ లైఫ్, శ్రీరామ్ గ్రూప్, ఎంఆర్ఎఫ్, టీవీఎస్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం



ద్వారకా తిరుములరావుకు విన్నవిస్తున్న విశ్రాంత కార్మికులు, యూనియన్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తనను కలిసిన విశ్రాంత ఎంప్లాయీస్ నేతలకు హామీ ఇచ్చారు. పట్టణానికి మంగళవారం విచ్చేసిన తిరుములరావుకు ఏపీ విశ్రాంత ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధి బృందం కలిసి వినతి అందజేశారు. స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్‌లో విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్‌ను ప్రతి నెల ఒకటో తేదీనే ఇవ్వాలని, విశ్రాంత ఉద్యోగులకు ఇస్తున్న పెన్షన్ ప్రతి నెల ఒకటో తేదీనే ఇవ్వాలని, విశ్రాంత ఉద్యోగులకు జీవిత భాగస్వామితో సహా సూపర్ లగ్జరీ బస్సులలో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. తిరుములరావు సానుకూలంగా స్పందించారు. తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎ.నరసింహారావు, ఓసూరి వీర్రాజు, ఆర్ఎస్ కుమార్, జి.వెంకట్రావు, జి.సోమేశ్వరరావు, ఆలమూరు సత్యనారాయణ, మద్దుకూరు కోటేశ్వరరావు, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

దివ్యాంగులపై కక్ష విడనాడాలి



మాట్లాడుతున్న రెడ్డి సంఘ ప్రతినిధులు

పెంటపాడు: దివ్యాంగులపై కూటమి ప్రభు త్వం వివక్షను విడనాడాలని రెడ్డి కమ్యూనిటీ డవలప్‌మెంట్ సొసైటీ (ఆర్సీడీఎస్) జిల్లా అధ్యక్షుడు కర్రి శ్రీనివాసరెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురా లు పోతంశెట్టి లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి సురేష్‌రెడ్డిలు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దివ్యాంగులను ఆదుకొనేందుకు ప్రత్యేక శ్రద్ధ కనపర్చిందన్నారు. నేడు వారిని ఆదుకొనేందుకు కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే రెడ్డి కార్పొరేషన్ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ ఎంఎస్ –6 ప్రకారం రెడ్ల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వాలు పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో పనులు జరగాలి



వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి గిరి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన నిర్మిస్తున్న వాటర్ ట్యాంకును నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి వీవీ గిరి సూచించారు. మంగళవారం మండలంలోని బంగారుగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకు ఐరన్ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ నిర్మాణంలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. డీఈ సోమేశ్వరరావు, ఏఈ రాజా శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది ఉన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై జేవీఎస్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుంచనపల్లి చెరు వు గట్టున పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ సందర్భంగా ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.64,140లు నగదు, ఐదు మోటారు సైకిళ్లు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.